


జన చేతనం

ఎలమంచిలిలో టీడీపీకి ఆదరణ

భలే రికార్డు

చట్టం...చత్రం

... వార్తలు 7వ పేజీలో


# ఎన్నికల బరిలో నిలిచేది వీరే!

**ముగిసిన నామినేషన్ల ఘట్టం**

- పాడేరు అసెంబ్లీకి 16 మంది, అరకులోయలో 17 మంది అభ్యర్థులు
- రెండు నియోజకవర్గాల్లో ఉపసంహరించుకున్నది ఏడుగురే

పాడేరు



గిడ్డి ఈశ్వరి (టీడీపీ)



మత్స్యరాస విశ్వేశ్వరరాజు (వైసీపీ)

అరకులోయ



పాంగి రాజారావు (బీజేపీ)



రేగం మత్స్యలింగం (వైసీపీ)

పాడేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులుగా బరిలో ఉండేవారు ఖరారయ్యారు. రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. పాడేరు అసెంబ్లీ స్థానానికి 16 మంది, అరకులోయ అసెంబ్లీ స్థానానికి 17 మంది బరిలో ఉన్నారు. ఎన్నికల బరిలో అనేక రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నప్పటికీ ఈసారి ప్రధాన పోటీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్యే ఉండనుంది.

**పాడేరు బరిలో 16 మంది...**

స్థానిక అసెంబ్లీ స్థానానికి 18 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందగా, సోమవారం టీడీపీ నేత కేవీ రమేశ్‌నాయుడు, స్వతంత్ర అభ్యర్థి చెద్రెకి గులాబీ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 16 మంది అభ్యర్థులే ఎన్నికల్లో పోటీలో నిలవనున్నారు. గిడ్డి ఈశ్వరి(టీడీపీ), మత్స్యరాస విశ్వేశ్వరరాజు(వైసీపీ), సుర్ల అప్పారావు(బీఎస్పీ), సతకా బుల్లిబాబు(కాంగ్రెస్), కింటుకూరి జోసెఫ్(ఇండియా ప్రజాబంధు పార్టీ), మినుముల రామారావు(సమాజ్ వాదీ పార్టీ), కిల్లో రంగారావు,(భారత చైతన్య పార్టీ) జై భారత్ నేషదమంతి నాగేశ్వరరావు(జైభారత్ నేషనల్ పార్టీ), బొంకు అర్జునరావు(జై మహాభారత్ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా వంతాల సుబ్బారావు, వల్లా మౌనిక, అడపా విష్ణుమూర్తి, ఎస్.శంకరరావు, చెద్రెకి అప్రియం బాబు, డొంకాడ శివప్రసాద్, కొక్కుల కన్నబాబు ఎన్నికల బరిలో ఉంటారని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. కాగా టీడీపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ... మిగతా 8వ పేజీలో

## అరకు పార్లమెంట్ బరిలో 13 మంది..



కొత్తపల్లి గీత (బీజేపీ)



గుమ్మ తనూజారాణి (వైసీపీ)



పాచిపెంట అప్పలనర్స (సీపీఎం)

పార్వతీపురం: అరకు పార్లమెంట్ పరిధిలో 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ఎన్డీఏ అభ్యర్థిగా బీజేపీ నుంచి కొత్తపల్లి గీత, వైసీపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణి పోటీలో ఉన్నారు. సీపీఎం నుంచి పాచిపెంట అప్పలనర్స, స్వతంత్ర అభ్యర్థులుగా మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, పాలక రంజిత్‌కుమార్, అతిథి, మండల గిరిధరరావు, సమ్మిరెడ్డి బాలకృష్ణ పోటీ చేస్తున్నారు. ఇండియా ప్రజాబంధు పార్టీ నుంచి వి.నిరక్షన్, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి ఆవశ్యలహరి, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి బి.చంటి, భారత్ ఆదివాసీ పార్టీ నుంచి ఎంరాజుబాబు, తెలుగు రాజాధికార సమితి పార్టీ నుంచి జల్లి రాంబాబు బరిలో ఉన్నారు.

**పార్వతీపురం మన్యంజిల్లా అసెంబ్లీ స్థానాలకు..**

కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడుగురు పోటీలో ఉన్నారు. తోయక జగదీశ్వరి(టీడీపీ), పాముల పుష్పశ్రీవాణి(వైసీపీ), మండంగి రమణ(సీపీఎం), తదితరులు పోటీలో ఉన్నారు. అలాగే పార్వతీపురం నియోజకవర్గంలో 8 మంది బరిలో ఉన్నారు. బోనెల విజయచంద్ర (టీడీపీ), అలజంగి జోగారావు (వైసీపీ), తదితరులు పోటీ పడుతున్నారు. పాలకొండ నియోజకవర్గం నుంచి ఏడుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. నిమ్మక జయకృష్ణ (జనసేన), విశ్వసరాయి కళావతి(వైసీపీ), తదితరులు పోటీలో ఉన్నారు. సాలూరు నియోజకవర్గం నుంచి బరిలో ఏడుగురు అభ్యర్థులు ఉన్నారు. గుమ్మిడి సంధ్యారాణి (టీడీపీ), పీడిక రాజన్నదొర(వైసీపీ), తదితరులు పోటీ పడుతున్నారు.

## ఎన్నికల విధులపైనా ఇంత నిర్లక్ష్యం?

- సాయంత్రం 3 గంటలకే ఉపసంహరణలు పూర్తయినా రాత్రి 10 గంటలకు ఈసీకి నివేదిక ఇవ్వని దుస్థితి
- కలెక్టర్‌తో సహా అసెంబ్లీ ఆర్వోలు సైతం ప్రత్యేక దృష్టిపెట్టని పరిస్థితి?

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

సార్వత్రిక ఎన్నికల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని పదే పదే రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈవో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ జిల్లాలోని ఎన్నికల విధుల్లో వున్న అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఉదాహరణకు సోమవారం అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సాయంత్రం 3 గంటలకే ముగిసింది. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సైతం రాత్రి 7 లేదా 8 గంటలకే తమ అసెంబ్లీ స్థానంలో ఉపసంహరణలు, బరిలో ఉండే అభ్యర్థులు, వారి గుర్తుల వివరాలతో కూడిన ఫారం-7ను ఎన్నికల కమిషన్‌కు, మీడియాకు విడుదల చేశారు. కానీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఫారం-7 వివరాలను రాత్రి పది గంటలకు సైతం ఎన్నికల కమిషన్‌కు నివేదించని పరిస్థితి నెలకొంది.

**ముందస్తు ప్రణాళిక లేకే ఈ దుస్థితి**

పాడేరు, అరకులోయ రిటర్నింగ్ అధికారులు ఉపసంహరణల తరువాత బరిలో ఉండే అభ్యర్థులు, వారికి కేటాయించాల్సిన గుర్తులు తదితర అంశాలకు సంబంధించి ముందస్తు కసరత్తు చేసుకోవాలి. కానీ అలా కాకుండా సోమవారం రాత్రికి సైతం బరిలో ఉండేవారెవరో, ఉపసంహరించుకున్న వాళ్లెవరో నిర్ధారించుకోలేని దుస్థితి నెలకొంది. అలాగే ఒక్కో అసెంబ్లీ స్థానంలో 16 మందికి పైబడి అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసిన క్రమంలోనే పోలింగ్ కేంద్రాల సంఖ్యలకు రెట్టింపుగా ఈవీఎంలు అవసరమనే అంశంపైనా ఎన్నికల పరిశీలకులు, జిల్లా ఎన్నికల అధికారి, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులు ముందుగానే దృష్టి సారించాల్సి ఉంటుంది. కానీ అలా కాకుండా ... మిగతా 8వ పేజీలో



ఎండ ప్రభావానికి నిర్మానుష్యంగా ఉన్న పాడేరు- చింతపల్లి మెయిన్ రోడ్డు

## తగ్గని భానుడి ప్రతాపం

- కొయ్యూరులో అత్యధికంగా 41.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎండల తీవ్రత కొనసాగుతున్నది. కొయ్యూరులో సోమవారం 41.7 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీలో సైతం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై తొమ్మిది గంటల తరువాత నుంచి దాని తీవ్రత అధికమవుతున్నది. మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై సంచరించేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఎండ ప్రభావం తగ్గుతున్నా ఉక్కపోత, వేడి వాతావరణం కొనసాగుతున్నది. తాజా వేడి వాతావరణానికి ఏజెన్సీ వాసులు సైతం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రత పెరుగుతుందనే వాతావరణ శాఖ ప్రకటనలతో జనం ఆందోళన చెందుతున్నారు.

**గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా..**

కొయ్యూరులో సోమవారం 41.7 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, ముంచంగిపుట్టులో 37.9, పాడేరు, చింతపల్లిలో 37.3, అరకులోయలో 36.7, పెదబయలులో 36.6, హుకుంపేటలో 36.2, జి.మాడుగులలో 35.0, అనంతగిరిలో 34.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## టీడీపీ పాడేరు అసెంబ్లీ ఎన్నికల సమన్వయకర్తగా బుద్ద నాగజగదీశ్



పాడేరు, ఏప్రిల్ 29(ఆంధ్ర జ్యోతి): టీడీపీ స్థానిక అసెంబ్లీ ఎన్నికల సమన్వయకర్తగా ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావును నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు బరిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ సీనియర్ నేతలను అసెంబ్లీ ఎన్నికల సమన్వకర్తలుగా నియమిస్తున్నారు. ఇందులో భాగంగా అనకాపల్లికి చెందిన బుద్ద నాగజగదీశ్వరరావును పాడేరు అసెంబ్లీకి సమన్వయకర్తగా నియమించారు. ఆయన గత ఎన్నికల్లోనూ ఇక్కడ సమన్వయకర్తగా పని చేశారు. ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, నియోజకవర్గంలోని ఇతర సీనియర్ నేతలతో చక్కని సమన్వయం ఉండడంతో పాటు స్థానిక పరిస్థితులపై సైతం నాగజగదీశ్వరరావుకు అవగాహన ఉంది. దీంతో ఆయనైతేనే పాడేరు అసెంబ్లీ స్థానంలో చక్కగా సమన్వయం చేస్తారని పార్టీ అధిష్ఠానం భావించిందని పార్టీ నాయకులు చెబుతున్నారు.

## జిల్లాలో 18,809 మంది ఇంటికే పింఛన్లు

- మొత్తం సామాజిక పింఛన్ల లబ్ధిదారులు లక్షా 27 వేల 894 మంది
- బ్యాంకు ఖాతాల్లో లక్షా 9 వేల 85 మందికి పింఛన్ సొమ్ము జమ చేయాలని నిర్ణయం



పాడేరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏప్రిల్ నెలలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా మే నెలలో పింఛన్ల పంపిణీపై భారత ఎన్నికల కమిషన్ సూచనలు అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. సచివాలయాలకు రాలేని స్థితిలో ఉన్న లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలని, మిగిలిన లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలో సొమ్మును జమ చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో మొత్తం సామాజిక పింఛన్ల లబ్ధిదారులు లక్షా 27 వేల 894 మంది కాగా, వారిలో లక్షా 9 వేల 85 మందికి సంబంధించిను రూ.32 కోట్ల 75 లక్షల 96 వేలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు, బ్యాంకు అధికారులకు సంబంధించిన సూచనలు, ఆదేశాలను కలెక్టర్ ఎం.విజయసునీత, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి ఎప్పటికప్పుడు వారికి అందిస్తున్నారు.

**18,809 మందికి ఇంటికే పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు**

జిల్లాలో కదల్లేని స్థితిలో వున్న 18,809 మంది పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దనే వారి పింఛన్ సొమ్మును అందించాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. కదల్లేని స్థితిలో వున్న 18,809 మంది పింఛన్‌దారులకు సంబంధించిన రూ.6 కోట్ల, 68 లక్షల, 9 వేల సొమ్మును వివిధ బ్యాంకుల ద్వారా విత్‌డ్రా చేసేలా ఎంపీడీవోలను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాల పరిధిలో 24 బ్యాంకుల్లోంచి ఈ సొమ్మును విత్‌డ్రా చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## కచ్చితంగా అభ్యర్థుల ఎన్నికల వ్యయాల లెక్కింపు

- పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కరణ్‌సింగ్ ఆదేశం
- కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన



ఎన్నికల పరిశీలకుడు కరణ్‌సింగ్‌కు కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో సీసీ ఫుటేజీని చూపిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పాడేరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాల వివరాలను కచ్చితంగా గుర్తించాలని, వాటికి సంబంధించిన రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని అరకులోయ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కరణ్‌సింగ్ ఆదేశించారు. సోమవారం ఇక్కడికి వచ్చిన ఆయన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హాలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో జిల్లా అధికారులు చేపట్టాల్సిన చర్యలు, జిల్లాలో తాజా పరిస్థితులపై వారిని అడిగి తెలుసుకున్నారు. పోటీలో ఉండే అభ్యర్థి ఖర్చు చేసే ప్రతి పైసా ఎన్నికల వ్యయంలోకి వస్తుందని గుర్తించాలన్నారు. ఈ అంశాలపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని ఆయన సూచించారు. అలాగే పెయిడ్ న్యూస్‌కు సంబంధించిన వ్యయాన్ని ఎన్నికల నిబంధనల అమలు కమిటీ గుర్తిస్తుందన్నారు. పత్రికలు, చానళ్లలో వచ్చే పెయిడ్ న్యూస్‌ను గుర్తించి, వ్యయంగా లెక్కించాలన్నారు. పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, అక్కడ వివిధ విభాగాలు నిర్వహించే రిజిస్టర్లను కరణ్‌సింగ్ తనిఖీ చేశారు.

వివిధ ప్రాంతాల్లోని చెక్ పోస్టుల్లో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించిన ఫుటేజీలను ఆయనకు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా చూపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, ఎన్నికల నోడల్ అధికారులు వి.మురళి, సువర్ణఫణి, పి.గోవిందరాజులు, పి.రాములు, సాయినవీన్, ఎల్.పూర్ణయ్య, శివయ్య, ఎల్‌బీ వెంకటరావు, రమేశ్‌కుమార్‌రావు, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంఘం నేత అరెస్టు, విడుదల

- పక్క జిల్లాలో సీఎం సభ ఉంటే జి.మాడుగులలో ధర్మాన పడాల్ అరెస్టు
- ఖండించిన గిరిజన సంఘం నేతలు



ధర్మాన పడాల్‌ను అరెస్టు చేసిన పోలీసులు

అరకులోయ/జి.మాడుగుల, ఏప్రిల్ 29: అనకాపల్లి జిల్లా చోడవరంలో సోమవారం ముఖ్యమంత్రి జగన్ బహిరంగ సభ ఉంటే జి.మాడుగుల మండలంలో ఉండే ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మాన పడాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జి.మాడుగుల మండలం గెమ్మెలి పంచాయతీ మద్దులబంధ గ్రామంలో ఉదయం ఆరు గంటలకే ధర్మాన పడాల్‌ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొంత సమయం తరువాత ఆయనను విడిచిపెట్టారు. పక్క జిల్లాలో సీఎం సభ జరిగితే ఈ జిల్లా గిరిజన నేతను అరెస్టు చేయడం ఏమిటని ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ నిరంకుశ చర్య అని బాలదేవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మాన పడాల్ అరెస్టును గిరిజన సంఘం నేతలు, వామపక్ష నేతలు ఖండించారు.


**ఎవరు గెలిచినా మీదే గెలుపు**

జిల్లా స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ..........

డోరు నెంబరు : .......... వీధి పేరు : ..........

గ్రామం/పట్టణం : .......... మండలం : ..........

జిల్లా : .......... పోస్టల్ పిన్‌కోడ్ : .......... ఫోన్ నెం. ..........

విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

| నియోజకవర్గం పేరు | NDA కూటమి | YSRCP | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| 1. భీమిలి | | | | |
| 2. విశాఖ తూర్పు | | | | |
| 3. విశాఖ పశ్చిమ | | | | |
| 4. విశాఖ ఉత్తరం | | | | |
| 5. విశాఖ దక్షిణం | | | | |
| 6. గాజువాక | | | | |
| 7. పెందుర్తి | | | | |
| 8. అనకాపల్లి | | | | |
| 9. యలమంచిలి | | | | |
| 10. పాయకరావుపేట | | | | |
| 11. నర్సీపట్నం | | | | |
| 12. చోడవరం | | | | |
| 13. మాడుగుల | | | | |
| 14. పాడేరు | | | | |
| 15. అరకు | | | | |
| మొత్తం : | | | | |

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : పోర్టు హాస్పిటల్ ఎదురుగా, ఎన్.హెచ్.16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-530016.


## కూటమి ప్రభుత్వంతోనే గిరిజనులకు మేలు



షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావాలంటే ఎన్డీఏ కూటమి అధికారంలో రావాలని బీజేపీ అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత అన్నారు. సోమవారం చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు. - వార్త 8వ పేజీలో..


ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్రే కీలకం -8లో



ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,

9985411639

ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.

9985411029



ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బండారు, సీఎం రమేశ్‌కు పైలా సంఘీభావం

## నారా లోకేశ్ హామీతో వెనక్కి తగ్గిన 'పైలా'

- స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్ ఉపసంహరణ
- కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేస్తానని హామీ

**చీడికాడ, ఏప్రిల్ 29 :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీతో ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు, మాడుగుల అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన పైలా ప్రసాదరావు వెనక్కితగ్గారు. దీంతో సోమవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకొని, కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తానని స్పష్టం చేశారు. తొలుత మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం పైలా పేరును ప్రకటించింది. అనివార్య కారణాల వల్ల అతనిని తప్పించి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిపింది. దీనిపై మనస్థాపానికి గురైన పైలా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, మాడుగుల అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తిలు పైలా ప్రసాదరావు నివాసానికి వెళ్లి మాట్లాడారు. ఈ విషయాన్ని నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన పైలాతో మాట్లాడడంతో సోమవారం నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. అంతేకాకుండా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, టీడీపీ నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, రెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

## హోమ్ ఓటింగ్‌కు నాలుగైదు బృందాలు

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

**అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 29:** జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో హోమ్ ఓటింగ్‌కు ప్రతీ నియోజకవర్గానికి నాలుగు నుంచి ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క బృందంలో ఒక ఏపీవో, ముగ్గురు ఓపీవో, ఒక పోలీస్, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు శిక్షణ ఇస్తామన్నారు. మే మూడో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు హోమ్ ఓటింగ్ జరిపేందుకు నిర్ణయించినట్టు కలెక్టర్ తెలిపారు. ప్రతీ ఆర్వో వద్ద పోస్టల్ ఓట్ సెంటర్‌ను, ఫెసిలిలేటెడ్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ ఫెసిలిలేటెడ్ సెంటర్‌కు ఒక నోడల్ అధికారిగా ఏఆర్‌ఓపీటీ ఉంటారన్నారు. ప్రతీ బూత్ నుంచి వన్ ప్లస్ త్రీ సిబ్బంది ఉంటారన్నారు. మే ఆరో తేదీ నుంచి ఎనిమిదవ తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఎనిమిది గంటల వరకు ఈ ఫెసిలిలేటెడ్ సెంటర్లు నడపబడతాయన్నారు. అన్ని రకాల పోస్టల్ ఓటింగ్ మే ఎనిమిదవ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు.

## సామాజిక న్యాయమే జనసేన ధ్యేయం

**బలిజ, ఒంటరి జేఏసీ ఉమ్మడి రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు దాసరి రాము**




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాసరి రాము, ఇతర నేతలు

**ఎలమంచిలి, ఏప్రిల్ 29:** అందరికీ సామాజిక న్యాయం అందించడమే ధ్యేయంగా జనసేన పార్టీని పవన్ కల్యాణ్ స్థాపించారని బలిజ, ఒంటరి జేఏసీ ఉమ్మడి రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు దాసరి రాము అన్నారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ అన్ని వర్గాల వారిని ఒక తాటిపైకి తీసుకువచ్చి రాష్ట్రాభివృద్ధిని సాగించేలా చేయడమే లక్ష్యంగా ఉన్నారన్నారు. కూటమి పార్టీల కలయికతో ఎనలేని అభివృద్ధి సాగుతుందన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలో జనసేన పార్టీ తరపున పోటీ చేసే సుందరపు విజయ్‌కుమార్ గత 13 ఏళ్లుగా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సేవకు అంకితమయ్యారన్నారు. విజయ్‌కుమార్‌తోపాటు బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌లను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు డొక్కా నాగభూషణం, రాష్ట్ర కాపు నాయకుడు గుర్రాల శ్రీనివాస్, సునీల్ నాయుడు, స్థానిక నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, నక్కా శివశంకర్ పాల్గొన్నారు.

## నెల పండగ ఘటాల ఊరేగింపు

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 29:** ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన నూకాంబిక అమ్మవారి నెల పండగ ఘటాల ఊరేగింపు సోమవారం రాత్రి ప్రారంభమైంది. బాలాలయంలో అమ్మవారి ముందు ఘటాలను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపును ప్రారంభించారు. మే ఏడో తేదీన అమ్మవారి నెల పండగ సందర్భంగా పండగకు తొమ్మిది రోజులు ముందు ఘటాల ఊరేగింపు నిర్వహించి నెల పండగ విశిష్టతను ప్రజలకు తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు.

# నాడు ఆహ్లాదం.. నేడు కళావిహీనం..!

**ఇదీ నాతవరంలోని 'మన ఊరి ఉద్యానవనం' దుస్థితి**

- 2018లో రూ.పది లక్షలతో ఏర్పాటు
- రెండేళ్లుగా నిర్వహణను పట్టించుకోని అధికారులు
- ప్రజాధనం వృథాపై గ్రామస్థులు ఆగ్రహం



ఉద్యానవనంలో సిమెంట్ బెంచీల ముందు వెలసిన పుట్టలు




నాతవరంలో మన ఊరి ఉద్యానవనం

**నాతవరం, ఏప్రిల్ 29:** మండల కేంద్రం నాతవరంలో గల 'మన ఊరి ఉద్యానవనం' అధ్వానంగా మారింది. ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాకర వాతావరణాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ పార్కుపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకోవడంతో నేడు కళావిహీనంగా మారింది. ఇక్కడి పీహెచ్‌సీ భవనం వెనుక ప్రాంతంలో పిచ్చి మొక్కులు నిండి ఉండడంతో 2018లో అప్పటి జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతంలో ఉద్యానవనం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా పది లక్షల రూపాయల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేశారు. దీంతో ఉద్యానవనం ఏర్పాటు చేయగా, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ప్రారంభించారు. కొంతకాలం పాటు బాగానే ఉన్నా.. రెండేళ్ల నుంచి ఈ ఉద్యానవనం నిర్వహణను గాలికి వదిలేశారు. కనీసం పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా ఇది కళావిహీనంగా మారింది. ఈ ఉద్యానవనం ముందర చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే ఇందులో ఉన్న కొన్ని చెట్లు ఎండలకు ఎండిపోయాయి. ఇక్కడున్న సిమెంటు బెంచీల ముందర ప్రస్తుతం పుట్టలు వెలిశాయి. పది లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసిన అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వదిలేయడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఈ ఉద్యానవనంలో పచ్చదనం పరిఢవిల్లేదని, అటువంటి సమయంలో కొందరు వచ్చి ఇక్కడ ఆహ్లాదకర వాతావరణంలో కాసేపు సేదదీరేవారని అంటున్నారు. కానీ ఇప్పుడు ఇది కళావిహీనంగా మారడంతో ఎవరూ రావడం లేదని చెపుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ ఉద్యానవనం నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించేలా చర్యలు చేపట్టాల్సిందిగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ప్రవేశ ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం



ఎండలకు ఎండిపోయిన చెట్లు

## భలే ఐడియా బాసూ..

భానుడు ఉగ్రరూపం చూపుతుండడంతో జనం రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. వివిధ పనులపై ఇళ్లను నుంచి బయటకు వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే మిట్ట మధ్యాహ్నం వేళ విధులు చేపట్టాల్సి ఉన్న ఓ పోస్టల్ ఉద్యోగి కాస్త వెరైటీగా ప్లాన్ చేశారు. చోడవరంలో పోస్టుమేన్‌గా పనిచేస్తున్న మాన్యం భాస్కర్ ఎండవేడిని తట్టుకునేందుకు వీలుగా తన స్కూటీ వాహనం పైభాగంలో టాప్ ఏర్పాటు చేయించారు. దానిపై చల్లగా ఉండేందుకు ఆకులు, వాటి మధ్య అక్కడక్కడా ఎర్రని కాగితపు పువ్వులను అలంకరించారు. ఇప్పుడు ఈ వాహనం రోడ్డుపై వెళుతుంటే పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. - చోడవరం



స్కూటీ వాహనంపై టాప్ ఏర్పాటు చేసి ఆకులు, పువ్వులను అలంకరించిన పోస్టమాన్

## ఉపాధి పథకాన్ని భ్రష్టుపట్టించిన జగన్

- కూటమి గెలిస్తే ఉపాధి పథకానికి మెరుగులు
- అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

**సబ్బవరం, ఏప్రిల్ 29:** రాష్ట్రంలో ఉపాధి పథకాన్ని కూడా సీఎం జగన్ భ్రష్టుపట్టించారని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని మొగలిపురంలో ఆయన టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుతో కలసి ఉపాధి కూలీలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు కల్పించాల్సిన సదుపాయాలను రాష్ట్రప్రభుత్వం కల్పించలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్ నిధులను దుర్వినియోగం చేసి ఇంటింటికీ కొళాయిల పథకాన్ని రాష్ట్రంలో నిర్వీర్యం చేశారని విమర్శించారు. కూటమి విజయం సాధిస్తే ఉపాధి పథకానికి మరింత మెరుగులు దిద్ది కూలీలకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నదులు అనుసందానంలో భాగంగా మొగలిపురం మీదుగా కాలువ రాకుండా ఎలైన్‌మెంట్ మారేలా చర్యలు తీసుకుంటానని సీఎం రమేశ్ హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనకు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుకు గాజుగ్లాసు గుర్తుపైన ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేయడమే కాకుండా పేదలకు రెండు సెంట్లు స్థలంలో ఇళ్లు కట్టిఇచ్చే విధంగా చంద్రబాబు చర్యలు తీసుకుంటారని చెప్పారు. గండి బాబ్జీ మాట్లాడుతూ.. వైసీపీ కల్లిబొల్లి మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, గండి దేముడు, ముత్యాలనాయుడు, ఎం.మహాలక్ష్మీనాయుడు, బీఏ రావు, వనం సత్యనారాయణ, రెడ్డి రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## గెడ్డం బుజ్జిని పరామర్శించిన అనిత

**పాయకరావుపేట, ఏప్రిల్ 29 :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జిని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత సోమవారం పరామర్శించారు. విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గెడ్డం బుజ్జిని ఆమె కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట టీడీపీ పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం ఉన్నారు.



ఆస్పత్రిలో బుజ్జితో మాట్లాడుతున్న అనిత

## క్రైం... crime news

### గాయపడిన యువకుడు మృతి

**నక్కపల్లి, ఏప్రిల్ 29:** ఈనెల 24న గొడిచెర్ల హైవే జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం మృతి చెందారు. మండలంలోని రేబాక గ్రామానికి చెందిన ఎస్.రమేశ్, ఎస్.పొట్టియ్య పాయకరావుపేట మండలంలో డెక్కన్ కంపెనీలో పని ముగించుకుని రేబాక బైక్‌పై వస్తుండగా గొడిచెర్ల హైవే వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు.అదే రోజు ఎస్.రమేశ్ మృతి చెందగా, తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సాధిరెడ్డి పొట్టియ్య (26) సోమవారం మృతి చెందినట్టు నక్కపల్లి పోలీసులు చెప్పారు.

### చికిత్స పొందుతూ మరొకరు..

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 29:** రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్టు రూరల్ హెచ్‌సీ రాజు తెలిపారు. దిబ్బపాలెం గ్రామానికి చెందిన ఎస్.వెంకట రామారావు ఈ నెల 21న బైక్‌పై అనకాపల్లికి వచ్చి తిరిగి గ్రామానికి వెళుతున్న సమయంలో తాతమ్మ మదుంపై వాహనం అదుపుతప్పి పడిపోవడంతో గాయపడ్డాడు. కుటుంబసభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు మృతుని సోదరుడు లీలా వెంకట సీతారామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ రాజు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**నక్కపల్లి, ఏప్రిల్ 29:** స్థానిక ఉపమాక హైవే జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మన్యం పార్వతీపురం జిల్లా పాలకొండ నుంచి ఈగల గోపి,భార్య రేవతి, రెండేళ్ల పాప హేమవర్షిణితో కలిసి కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు బైక్‌పై వెడుతుండగా ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న బైక్ ఉపమాక హైవే జంక్షన్‌కు వచ్చేసరికి మరో బైక్ ఢీకొట్టింది. దీంతో ఈగల గోపి, అతని కుమార్తె హేమ వర్షిణి తీవ్రంగా గాయపడగా, మరో బైక్‌పై వున్న అడ్డరోడ్డుకు చెందిన మోటారి కిరణ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వీరికి నక్కపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

### రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు..

**చీడికాడ, ఏప్రిల్ 29:** మండలంలోని అర్జునగిరి రోడ్డు మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు తగిలాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. సోమవారం మధ్యాహ్నం ఎస్ఎన్‌పురం గ్రామానికి చెందిన చందు అనే వ్యక్తి తురువోలు మీదుగా అర్జునగిరి బైక్‌పై వస్తుండగా, దేవరాపల్లి మండలం వాకపల్లికి చెందిన పుట్టా సామయ్య, బుగతా చినఅప్పలనాయుడు చోడవరం నుంచి అర్జునగిరి మీదుగా టీవీఎస్ వాహనంపై వస్తున్నారు. ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఈ ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో చోడవరంలో సీఎం జగన్ ఎన్నికల ప్రచారం అనంతరం అర్జునగిరి వైపు వస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఈ సంఘటనను చూసి 108కు ఫోన్ చేశారు. వెంటనే సదరు సిబ్బంది వచ్చి క్షతగాత్రులను చోడవరం ఆస్పత్రికి తరలించారు.

## ఇండిపెండెంట్‌ను నిర్బంధించిన సీఐ

**నామినేషన్‌ను వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి.. ఆర్వోకు బాధితుడి ఫిర్యాదు**

**విచారణ అనంతరం సీఐపై సీపీ సస్పెన్షన్ వేటు**



**విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** విశాఖ నగర పరిధిలోని మల్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సన్యాసినాయుడును పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం సస్పెండ్ చేశారు. పశ్చిమ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా కొయిలాడ వెంకట జగదీశ్వరరావు అనే రౌడీషీటర్ నామినేషన్ వేశారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుంటారు. ఈనెల 28న మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు జగదీశ్వరరావు హాజరయ్యాడు. కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన రౌడీషీటర్లు అందరినీ ఇంటికి పంపించేసిన సీఐ సన్యాసినాయుడు ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన జగదీశ్వరరావును మాత్రం స్టేషన్‌లోని మొదటి అంతస్థుకు తీసుకువెళ్లి రెండున్నర గంటలపాటు నిర్బంధించారు. నామినేషన్‌ను వెనక్కి తీసుకోవాలంటూ అసభ్య పదజాలంతో దూషించి ఇబ్బందులకు గురిచేశారు. దీంతో జగదీశ్ స్టేషన్ మొదటి అంతస్తు నుంచి కిందికి దూకి పారిపోయేందుకు యత్నించగా సిబ్బంది పట్టుకున్నారు. ఇంటికి తీసుకువెళ్లి కుటుంబసభ్యులకు అప్పగించారు. జగదీశ్వరరావు శరీరంపై గాయాలు ఉండడంతో కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తీసుకువెళ్లి ఎంఎల్‌సీ కేటగిరీలో చేర్పించి చికిత్స చేయించారు. సీఐ తన పట్ల వ్యవహరించిన తీరుపై ఆధారాలతో బాధితుడు జగదీశ్వరరావు పశ్చిమ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తిని ఆదేశించారు. విషయం సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ దృష్టికి చేరడంతో సీఐ సన్యాసినాయుడును ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సస్పెన్షన్ సమయంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నగరాన్ని విడిచి బయటకు వెళ్లడానికి వీల్లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 120.00 |
| లైవ్ ధర | 140.00 |
| విత్ స్కిన్ | 250.00 |
| స్కిన్ లెస్ | 260.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 400 |
| విజయనగరం | 404 |
| శ్రీకాకుళం | 404 |


## CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, **VADLAMANI LALITHA** (Old Name), W/o. ASRK Sastry, resident of 50-19-6/A, 1st Floor, Radhika Mansion, TPT Colony, Visakhapatnam. Change my name from **VADLAMANI LALITHA** (Old Name) to **AYALASOMAYAJULU LALITHA GAYATHRI** (New Name) hence forth I am being called as **AYALASOMAYAJULU LALITHA GAYATHRI** (New Name), W/o. ASRK Sastry, for all purposes.
AJV_182898

**CHANGE OF NAME**

★ I, **LISSY K U** (Old Name), W/o. Mangaparambil Kurian Denesh, resident of 1-157, Kairali English Medium High School, Devarapalli, Anakapalli. Change my name from **LISSY K U** (Old Name) to **MANGAPARAMBIL LISSY DINESH** (New Name) hence forth I am being called as **MANGAPARAMBIL LISSY DINESH** (New Name), W/o. Mangaparambil Kurian Denesh, for all purposes.
AJV_182894

**CHANGE OF NAME**

★ I, **NAKIL VRUSHALI RAJENDRA** (Old Name), W/o. Nallamsetty Siva Rama Krishna, resident of 1-15, Kottapeta, Mallam, Kakinada. Change my name from **NAKIL VRUSHALI RAJENDRA** (Old Name) to **NALLAMSETTY VRUSHALI** (New Name) hence forth I am being called as **NALLAMSETTY VRUSHALI** (New Name), W/o. Nallamsetty Siva Rama Krishna, for all purposes.
AJV_182897

**CHANGE OF NAME**

★ I, **GANGAB HAVANI ANNU** (Old Name), W/o. Asif Abdul, resident of 6-393, Chakirevu Konda, Simhachalam, Visakhapatnam. Change my name from **GANGAB HAVANI ANNU** (Old Name) to **GANGA BHAVANI ABDUL** (New Name) hence forth I am being called as **GANGA BHAVANI ABDUL** (New Name), W/o. Asif Abdul, for all purposes.
AJV_182893

**CHANGE OF NAME**

★ I, **GANDHAM VENKATA SATISH KUMAR** (Old Name), S/o. Gandham Srinivasa Rao, resident of 5-6-56P, Dayarguda, Kukatpally, Hyderabad. Change my name from **GANDHAM VENKATA SATISH KUMAR** (Old Name) to **GANDHAM VENKATA NAGA SATISH KUMAR** (New Name) hence forth I am being called as **GANDHAM VENKATA NAGA SATISH KUMAR** (New Name), S/o. Gandham Srinivasa Rao, for all purposes.
AJV_182896

**CHANGE OF NAME**

★ I, **PALAPARTHI CHANDRA SHEKHARA RAO** (Old Name), S/o. Palaparthi Chinna Ramana, resident of 25-125, Golla street, Munjeru, Bhogapuram, Vizianagaram. Change my name from **PALAPARTHI CHANDRA SHEKHARA RAO** (Old Name) to **PALAPARTHI CHANDRASEKHARA RAO** (New Name) hence forth I am being called as **PALAPARTHI CHANDRASEKHARA RAO** (New Name), S/o. Palaparthi Chinna Ramana, for all purposes.
AJV_182895

For Advertisement Contact :
9963231176
9966165093

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి


# ఐఏఎస్ అధికారికి గ్రేటర్ నజరానా!

**నగరంలో ఆయన భార్య పేరిట ఉన్న భవనాన్ని గెస్ట్ హౌస్ కింద అద్దెకు తీసుకున్న జీవీఎంసీ**

- నెలకు రూ.లక్షల్లో చెల్లింపులు.. సర్వత్రా విమర్శలు
- సదరు అధికారికి ప్రయోజనం కల్పించేందుకే..
- పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్థానిక అధికారుల నిర్ణయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎప్పుడొస్తారో...ఒకవేళ వచ్చినా సరే అక్కడ బస చేస్తారో లేదో గ్యారంటీ కూడా లేదు. అయినా అతిథుల కోసమంటూ గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) అధికారులు ఒక భవనాన్ని గెస్ట్‌హౌస్ పేరుతో అద్దెకు తీసుకుని నెలకు రూ.లక్షలు చెల్లిస్తున్నారు. ఒకవేళ గెస్ట్‌హౌస్ కోసం భవనం అద్దెకు తీసుకోవాలనుకుంటే టెండర్ ప్రకటన ఇవ్వాలి. కానీ, అధికారులు మాత్రం ఎందుకనో రహస్యంగా తతంగం నడిపించారు. ఇదంతా ఒక ఐఏఎస్ అధికారికి లబ్ధి చేకూర్చేందుకేనని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించిన వివిధ పనులు, సమీక్షలు, సమావేశాల కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు నగరానికి వస్తే స్టార్ హోటళ్లలో బస చేస్తుంటారు. వారికి సంబంధించిన వసతి, భోజనం, రవాణా ఖర్చులను జీవీఎంసీయే భరిస్తుంది. అలాంటి అతిథులు నగరానికి రావడం అరుదనే చెప్పుకోవాలి. వారు నోవాటెల్, గేట్‌వే, గ్రాండ్‌బే, రాడిసన్‌బ్లూ వంటి స్టార్ హోటళ్లలో బస చేసినా ఖర్చు గరిష్ఠంగా నెలకు రూ.లక్షకు మించదు. కానీ, అతిథుల కోసమంటూ జీవీఎంసీ అధికారులు నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించేందుకు సిద్ధమై ఒక భవనాన్ని గెస్ట్ హౌస్‌గా తీసుకున్నారు.

### అసలు ఏం జరిగిందంటే...

రాష్ట్ర రాజధానిలో కీలక పోస్టులో ఉన్న ఒక ఐఏఎస్ అధికారికి నగరంలోని విశాలాక్షి నగర్‌లో ఐదంతస్థుల భవనం ఉంది. కొద్దినెలల కిందటే దీని నిర్మాణం పూర్తయ్యింది. ఒక్కో అంతస్థు 1,750 చదరపు అడుగులు చొప్పున, ఐదు అంతస్థులు కలిపి 8,500 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. దీనికి రెసిడెన్షియల్ కేటగిరీ కింద జీవీఎంసీ రెవెన్యూ అధికారులు ఆస్తి పన్ను విధించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఖాళీగా ఉండిపోవడంతో ఆ భవనాన్ని జీవీఎంసీ అవసరాల కోసం అద్దెకు తీసుకునేలా చూడాలని సదరు ఐఏఎస్ అధికారి...మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో చక్రం తిప్పుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి ద్వారా జీవీఎంసీ అధికారికి చెప్పించినట్టు సమాచారం. సీనియర్ ఐఏఎస్ అధికారి చెప్పడమే తరువాయి అన్నట్టు జీవీఎంసీ అధికారి విశాలాక్షి నగర్‌లో ఐఏఎస్ అధికారి భార్య పేరిట ఉన్న ఐదంతస్థుల భవనాన్ని నగర పాలక సంస్థ అవసరాల కోసం గెస్ట్‌హౌస్‌గా తీసుకోవాలని నిర్ణయించేశారు. నెలకు రూ.20 లక్షలు అద్దె చెల్లించడంతో పాటు కరెంట్ బిల్లు, అక్కడ పనిచేయడానికి సిబ్బంది నియామకం కూడా జీవీఎంసీయే భరించేలా ఒప్పందం చేసుకున్నట్టు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఏదైనా రెసిడెన్షియల్ భవనాన్ని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకోవాలనుకుంటే చదరపు అడుగుకు గరిష్ఠంగా రూ.20 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అంతకుమించి చెల్లించాల్సి వస్తే కౌన్సిల్ నుంచి ప్రత్యేక అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ అవేమీ పాటించకుండా నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించేందుకు జీవీఎంసీ అధికారి నిర్ణయం తీసేసుకున్నారు. ఇక ఒప్పందం జరిగి నాలుగు నెలలు గడిచినా నగరానికి వచ్చిన అతిథి ఒక్కరు కూడా ఆ భవనంలో బస చేసిన దాఖలాలు లేవు. అయినాసరే విస్కో నుంచి ప్రతి నెలా అద్దె చెల్లింపు మాత్రం జరిగిపోతోంది. ఒకవేళ జీవీఎంసీకి వచ్చిన అతిథులకు స్టార్ హోటల్‌లో వసతి కల్పించినా గెస్ట్‌హౌస్‌కు చెల్లించే అద్దెలో పది శాతానికి మించి ఖర్చయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇదిలావుండగా అధికారులు మాత్రం జీవీఎంసీ పనుల మీద నగరానికి వచ్చే అతిథులు బస చేయాల్సి వస్తే ఒక గెస్ట్‌హౌస్ ఉండాలనే ఉద్దేశంతోనే ఆ భవనాన్ని అద్దెకు తీసుకున్నామని సమర్థించుకుంటున్నారు. అలాగే గెస్ట్‌హౌస్‌కు చెల్లించే అద్దె కూడా రూ.20 లక్షలు కాదని, కేవలం రూ.2.1 లక్షలు మాత్రమేనని చెబుతున్నారు. కానీ అందుకు సంబంధించిన అధికారిక వివరాలను మాత్రం బయటపెట్టడం లేదు. గెస్ట్‌హౌస్ వ్యవహారాన్ని విపక్ష కార్పొరేటర్లు బయటపెట్టడంతో ఉలిక్కిపడిన జీవీఎంసీ అధికారి జరిగిన తప్పును సరిదిద్దుకోవడంపై దృష్టిపెట్టకుండా, ఆ సమాచారం బయటకు ఎలా వెళ్లిందనే దానిపై నీటి సరఫరా, విస్కో, రెవెన్యూ విభాగం అధికారులను పిలిచి ఆరా తీస్తున్నట్టు తెలిసింది.



**ఎలమంచిలి నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,04,073 |
| పురుషులు | 99,340 |
| మహిళలు | 1,04,724 |
| ఇతరులు | 9 |

## ఓటరు మాట

### ఉచితాలు కాదు...ఉపాధి కావాలి



ప్రభుత్వ అసమర్థతతో నిరుద్యోగం పెరిగిపోయింది. రాష్ట్రంలో ఆర్థిక నేరాలు, హత్యలు, దొంగతనాలు పెచ్చుమీరాయి. సర్కారు ఉచితాలంటూ ప్రజలను సోమరులుగా మార్చేసింది. ప్రతి ఇంట్లోనూ చదువుకున్న యువత ఉన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తే వారే కుటుంబాలను పోషించుకోగలరు. మద్య నిషేదం చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మాటతప్పింది. ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించి, ఇలాంటి వారికి బుద్ధిచెప్పాలి. భవిష్యత్తుకు భరోసా ఇచ్చే పార్టీనే గెలిపించాలి.

- కె.సరళ, కైలాసపురం రోడ్డు, విశాఖ

### న్యాయం చేసే ప్రభుత్వం రావాలి



రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసే ప్రభుత్వం కావాలి. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే వ్యక్తిత్వం ఉన్న నేతలకే ఓటు వేయాలి. ప్రజావసరాలను గుర్తించి, పరిష్కరించే సత్తా, సామర్థ్యం కలిగిన నేతలను ఎన్నుకుంటేనే భవిష్యత్తుకు భరోసా.

- ఎ.విజయకుమార్, అనకాపల్లి

### ఉక్కు పరిరక్షణకు హామీ ఇస్తేనే...



స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని హామీ ఇచ్చే పార్టీకి ఓటు వేయాలి. ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం కాకుండా కార్మికులు ఏళ్లుగా ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నారు. ఎన్నికల సమయం వచ్చింది. పరిశ్రమను కాపాడుతామని హామీ ఇచ్చిన వారికే ఓటు వేయాలి.

- ఆర్.తిరుమలరావు, గోపాలపట్నం

### మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

# ఎలమంచిలిలో టీడీపీకి ఆదరణ



దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన నియోజకవర్గాలపునర్విభజనలో ఏర్పాటైన వాటిల్లో 'ఎలమంచిలి' ఒకటి. అంతకుముందు కొంతభాగం అటు పాయకరావుపేట నియోజకవర్గంలో ఉండేది. రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాలు కొండకర్ల నియోజకవర్గంలో ఉండేవి. ఎలమంచిలి సమితిగా ఉన్న సమయంలో 1952లో నియోజకవర్గంగా మారింది. మండల వ్యవస్థ ఏర్పాటైన తరువాత ఎలమంచిలి నియోజకవర్గంలో ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో పాటు ఎస్.రాయవరం, మునగపాక మండలాల్లోని కొన్ని గ్రామాలు ఉండేవి. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో మునగపాక మండలాన్ని పూర్తిగా ఎలమంచిలి నియోజకవర్గంలోకి, ఎస్.రాయవరం మండలాన్ని పాయకరావుపేట నియోజకవర్గంలో విలీనం చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎలమంచిలి, రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గం ఒకప్పుడు పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఆ తరువాత అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు ప్రారంభమయ్యాక పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు సాధించింది. అలాగే మేజరు పంచాయతీగా ఉండే ఎలమంచిలి చుట్టుపక్కల ఏడు పంచాయతీల విలీనంతో మునిసిపాలిటీగా మారింది.



పప్పల బాపునాయుడు



వీసం సన్యాసినాయుడు



నగిరెడ్డి సత్యనారాయణ

## నాలుగుసార్లు పప్పల చలపతిరావే విజేత

- ఇప్పటివరకూ 15సార్లు ఎన్నికలు
- ఆరుసార్లు తెలుగుదేశం, నాలుగుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసీపీ అభ్యర్థుల గెలుపు

### టీడీపీకే ఆధిక్యం

నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి నేటివరకూ 15సార్లు ఎన్నికలు జరిగాయి. తొలి ఆరు ఎన్నికల్లో మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులు (సి.వి.ఎస్.రాజు, నగిరెడ్డి సత్యనారాయణ, కె.కె.వి.రాజు) గెలిచారు. 1952 ఎన్నికల్లో పప్పల బాపునాయుడు కృషికార్ లోక్ పార్టీ నుంచి గెలుపొందగా, 1955లో సి.వి.ఎస్.రాజు స్వతంత్ర్య అభ్యర్థిగా విజయం సాధించారు. తరువాత 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వీసం సన్యాసినాయుడు...సీపీఐ అభ్యర్థి వెలగా వీరభద్రరావు (సీపీఐ)పై గెలుపొందారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నగిరెడ్డి సత్యనారాయణ...కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వీసం సన్యాసినాయుడుపై విజయం సాధించారు. 1972లో స్వతంత్ర అభ్యర్థి కె.కె.వి.రాజు...సన్యాసినాయుడుపై గెలుపొందారు. 1978లో వీసం సన్యాసినాయుడు(కాంగ్రె స్)...నగిరెడ్డి సత్యనారాయణపై గెలిచారు. 1983లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన కేకేవీఎస్ రాజు కాంగ్రెస్ అభ్యర్థి వీసం సన్యాసినాయుడుపై గెలుపొందారు. 1985, 1989లో వీసం సన్యాసినాయుడుపైన, 1994లో నగిరెడ్డి ప్రభాకర్‌రావుపైన, 1999లో ఉప్పలపాటి యువి.రమణమూర్తిరాజు (కన్నబాబు)పైన వరుసగా నాలుగుసార్లు తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన పప్పల చలపతిరావు గెలుపొందారు. 2004, 2009లో రెండు సార్లు ఒకసారి టీడీపీ, మరోసారి ప్రజా రాజ్యం తరపున పోటీకి దిగిన గొంతిన నాగే శ్వరరావుపై కన్నబాబురాజు విజయం సాధించారు. అనంతరం 2014 ఎన్నికల్లో వైసీపీ పార్టీ అభ్యర్థి ప్రగడ నాగేశ్వరావుపై పంచకర్ల రమేశ్‌బాబు గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుపై యువి. రమణమూర్తిరాజు గెలుపొందారు. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక చాలా ఏళ్లపాటు విపక్షాలకు నియోజకవర్గంలో చోటులేకుండా పోయింది. వరుసగా ఆ పార్టీ అభ్యర్థులు ఐదుసార్లు విజయకేతనం ఎగురవేశారు. 1983లో జరిగి ఎన్నికల్లో కె.కె.వి. రాజు గెలుపొందగా తర్వాత పప్పల చలపతిరావు వరుసగా నాలుగుసార్లు గెలిచి సంచలనం సృష్టించారు. 1989లో రాష్ట్రం అంతటా కాంగ్రెస్ గాలి వీచినా ఇక్కడి ప్రజలు టీడీపీకే పట్టం కట్టడం విశేషం. టీడీపీ జైత్రయాత్రకు 2004లో బ్రేక్‌పడింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో చలపతిరావును అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించిన టీడీపీ అధిష్ఠానం, ఆయన స్థానంలో గొంతిన నాగేశ్వరరావుకు టికెట్ ఇచ్చింది. ఎంపీగా పప్పల చలపతిరావు విజయం సాధించినా ఎలమంచిలి నియోజకవర్గంలో మాత్రం పార్టీ అభ్యర్థి గొంతిన నాగేశ్వరరావు ఓడిపోయారు. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో యు.వి.రమణమూర్తి రాజు వైసీపీ అభ్యర్థిగా, సుందరపు విజయకుమార్ జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అభ్యర్థులు ఎంతమంది ఉన్నా వీరిద్దరి మధ్య ప్రధాన పోటీ జరగనున్నది.

● ఎలమంచిలి



పప్పల చలపతిరావు



యు.వి.రమణమూర్తిరాజు



పంచకర్ల రమేష్ బాబు

ఎలమంచిలి వ్యూ

### ఎలమంచిలి ఎమ్మెల్యేలు వీరే


| సంవత్సరం | విజేత | పార్టీ | మెజార్టీ | ప్రత్యర్థి |
|---|---|---|---|---|
| 1952-1955 | పప్పల బాపునాయుడు | కృషికార్ లోక్‌పార్టీ | .... | ఎ.సూర్యనారాయణమూర్తి (కాంగ్రెస్) |
| 1955-1962 | సి.వి.ఎస్.రాజు | ఇండిపెండెంట్ | 3,660 | కాండ్రేగుల రామజోగి (సీపీఐ) |
| 1962-1967 | వీసం సన్యాసినాయుడు | కాంగ్రెస్ | 3,626 | వెలగా వీరభద్రరావు (సీపీఐ) |
| 1967-1972 | నగిరెడ్డి సత్యనారాయణ | ఇండిపెండెంట్ | 2,355 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1972-1978 | కె.కె.వి.రాజు | ఇండిపెండెంట్ | 6,548 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1978-1983 | వీసం సన్యాసినాయుడు | కాంగ్రెస్ | 8,667 | నగిరెడ్డి సత్యనారాయణ (జెఎన్‌పి) |
| 1983-1985 | కేకేవీఎస్ రాజు | టీడీపీ | 7,828 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1985-1989 | పప్పల చలపతిరావు | టీడీపీ | 9,920 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1989-1994 | పప్పల చలపతిరావు | టీడీపీ | 12,254 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1994-1999 | పప్పల చలపతిరావు | టీడీపీ | 24,246 | నగిరెడ్డి ప్రభాకరరావు (కాంగ్రెస్) |
| 1999-2004 | పప్పల చలపతిరావు | టీడీపీ | 7,054 | యూవీరమణమూర్తిరాజు (కాంగ్రెస్) |
| 2004-2009 | యు.వి.రమణమూర్తిరాజు | కాంగ్రెస్ | 5,863 | గొంతిన నాగేశ్వరరావు (టీడీపీ) |
| 2009-2014 | యు.వి.రమణమూర్తిరాజు | కాంగ్రెస్ | 10,090 | గొంతిన నాగేశ్వరరావు (ప్రజారాజ్యం) |
| 2014-2019 | పంచకర్ల రమేశ్‌బాబు | టీడీపీ | 8,375 | ప్రగడ నాగేశ్వరరావు (వైసీపీ) |
| 2019-2024 | యు.వి.రమణమూర్తిరాజు | వైసీపీ | | పంచకర్ల రమేశ్‌బాబు (టీడీపీ |

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకం. ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వానికి ఓ మార్గం. ఏ ఎన్నికలైనా ప్రజాభిప్రాయాన్ని వంద శాతం ప్రతిబింబించేలా ఉండాలి. ఇందుకు నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ జరగాలి. అలా జరిగేందుకు రాజ్యాంగం ఏర్పాటుచేసిన వ్యవస్థే కేంద్ర ఎన్నికల సంఘం. దీనికి అనుబంధంగా రాష్ట్ర స్థాయి కమిషన్‌లు ఉంటాయి. దేశంలో జరిగే ఏ స్థాయి ఎన్నికలైనా ఎన్నికల సంఘం ప్రత్యక్ష, పరోక్ష అజమాయిషీలోనే జరుగుతాయి. అందువల్ల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మరుక్షణం వ్యవస్థలన్నీ ఎన్నికల సంఘం పరిధిలోకి వెళతాయి. ఈసీ కనుసన్నల్లోనే నడుచుకోవాల్సి ఉంటుంది. అందువల్ల కోడ్ అమలులో ఉండగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎంత జాగ్రత్తగా ఉంటే వారి భవిష్యత్తుకు అంత మంచిది.

## ఎన్నికల వేళ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే

- అతిక్రమిస్తే శిక్ష ఎదుర్కొనాల్సి రావచ్చు
- తెలిసి జరిగినా... తెలియక జరిగినా అభ్యర్థులే బాధ్యులు
- మీతోపాటు అనుచరులనూ అప్రమత్తంగా ఉంచాలి
- కోడ్ అమలులో ఉండగా కమిషన్ కనుసన్నల్లోనే అన్నీ

# చట్టం... చట్రం




సార్వత్రిక ఎన్నికలు ఐదేళ్లకొకసారి నిర్వహించాలని రాజ్యాంగం నిర్దేశించింది. అనివార్య కారణాలు, ప్రభుత్వాల అనిశ్చితి, పాలకుల నిర్ణయాల వల్ల కొంచెం అటూఇటుగా జరగొచ్చు. ఎప్పుడు నిర్వహించినా ఎన్నికల నిర్వహణ మహాక్రతువు. అధికారం దక్కించుకునేందుకు రాజకీయ పక్షాలు ఎంతగా కష్టపడాలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అంతకు రెట్టింపు కష్టపడాలి. ఈ క్రమంలో ఎవరు ఎన్నికల నియమావళిని అతిక్రమించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తారు. ఆ తర్వాత చర్యలు తప్పవు. అందువల్ల ఎన్నికల ప్రచారం సందర్భంలో రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు...ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఇబ్బందుల్లో పడినట్టే. సాధారణ పౌరులు, ఓటర్లు, ఎవరు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా కమిషన్ తక్షణం విచారణకు ఆదేశిస్తుంది. ఉమ్మడి జిల్లాలోని మూడు లోక్‌సభ, 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు వచ్చేనెల 13న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ఘట్టం కూడా సోమవారం పూర్తయ్యింది. ఇక ఎన్నికలు జరగడమే తరువాయి. అయితే అభ్యర్థులు, పార్టీలకు గెలుపు ఎంతముఖ్యమో ఎన్నికల నియమావళికి లోబడిపనిచేయడం అంతే ముఖ్యం. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉంది. అంటే రాజకీయ పక్షాలు, ప్రతినిధులు చట్టం చట్రంలో ఉన్నట్టే. ఈ నేపథ్యంలో ఎన్నికల చట్టాలు, నియమ నిబంధనలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

### కులమతాలను రెచ్చగొడితే....

ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు తమ ప్రసంగాల్లో కుల, మతాలను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడకూడదు. ఎవరైనా ఆ విధంగా చేసినట్లయితే ఎన్నికల చట్టంలోని సెక్షన్ 123 ప్రకారం సాధారణ పౌరులు కూడా ఫిర్యాదు చేయొచ్చు.

### వర్గ విభేదాలు సృష్టిస్తే జైలే...

ఎన్నికల సందర్భంగా ఎవరైనా వర్గ విభేధాలు సృష్టించే ప్రయత్నం చేస్తే సెక్షన్ 125 ప్రకారం మూడేళ్లపాటు జైలుశిక్ష, జరిమానా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రెండూ విధించే అధికారం కోర్టుకు ఉంటుంది.

### 48 గంటల ముందే ప్రచారానికి తెర...

ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలి. ఒక వేళ ఏ పార్టీకి సంబంధించిన నాయకులు, అభ్యర్థులైనా ఆ తర్వాత సభలు, సమావేశాలు నిర్వహించినట్టు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందితే సెక్షన్ 126 ప్రకారం శిక్ష తప్పదు. ఫిర్యాదు దారుడు అందించిన సాక్ష్యాధారాల ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

### అల్లర్లు సృష్టిస్తే ఆరు నెలల జైలు

ఎన్నికల సభలు, సమావేశాలు, ప్రచారం సందర్భంలో అల్లర్లు సృష్టించినట్టు రుజువైతే పోలీసులు బాధ్యులైన మూకలను చట్టంలోని 127 సెక్షన్ ప్రకారం అరెస్టు చేయవచ్చు. రుజువైతే కనీసం ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2వేల వరకు జరిమానా తప్పదు.

### పోలింగ్ సిబ్బందికి చిక్కులే

చట్టంలోని 129 సెక్షన్ ప్రకారం ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసులు ఏ పార్టీకి చెందిన అభ్యర్థికైనా బహిరంగంగా, లోపాయికారీగా సహకరిస్తే చిక్కుల్లో పడతారు. అలా చేసినట్టు ఉద్యోగులపై ఫిర్యాదులు అందితే, కమిషన్ విచారణ జరుపుతుంది. నేరం రుజువైతే ఉద్యోగులకు కనీసం మూడు నెలల జైలుశిక్ష విధించే అవకాశం ఉంది. ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పోలింగ్ ఏజెంట్లుగా, ఓట్ల లెక్కింపు ఏజెంట్లుగా పార్టీల తరుపున వెళితే అటువంటి వారిపై ఫిర్యాదులు అందితే కమిషన్ సెక్షన్ 134ఎ ప్రకారం చర్యలు చేపట్టనున్నది. నేరం రుజువైతే కనీసం మూడు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

### ఈవీఎంలు అపహరిస్తే ఏడాది జైలు

పోలింగ్ కేంద్రాల నుంచి అల్లరి మూకలు ఈవీఎంలు అపహరిస్తే అటువంటి వారిపై పోలీసులు చట్టంలోని 135వ సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేస్తారు. దుండగులకు ఏడాది జైలు శిక్ష, రూ500 జరిమానా విధించే అవకాశం ఉంది.

### మారణాయుధాలతో తిరిగితే...

ఎన్నికల సందర్భంగా ఎవరైనా మారణాయుధాలతో తిరగడం నేరం. సంబంధిత పోలీసులు మారణాయుధాలతో పట్టుబడిన వ్యక్తులకు రెండు నెలల జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది.

### మీ ఓటు మరొకరు వేస్తే...

పోలింగ్ కేంద్రానికి వెళ్లేసరికే మీ ఓటు ఎవరైనా వేసేస్తే పోలింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. మీ ఓటుకు సంబంధించి సరైన ఆధారాలు చూపిస్తే, ఓటు దుర్వినియోగం అయినట్టు తేలితే పోలింగ్ అధికారి మీకు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. దీన్నే ఛాలెంజింగ్ ఓటు అంటారు. దీన్ని బ్యాలెట్ బాక్స్‌లో కాకుండా ప్రత్యేకంగా భద్రపరుస్తారు.

### బహిరంగంగా ఓటేసినా ఇబ్బందే

ఎన్నికల నిబంధనావళి ప్రకారం ఓటు వేసే ప్రక్రియ రహస్యంగా సాగాలి. ఓటర్లు ఎవరైనా బహిరంగంగా ఓటు వేస్తే ఆ ఓటరుకు చట్టం ప్రకారం మూడు నెలల జైలు, జరిమానా విధిస్తారు. ఓటేసే వారు నియమ నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవు.

### పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిషేధం

పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లలోపు ఎన్నికల ప్రచారాన్ని కమిషన్ నిషేధించింది. ఒకవేళ ఎవరైనా నిబంధనలు అతిక్రమించి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రచారం చేస్తే ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు బాధ్యత వహించాల్సి వస్తుంది. పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రచార సామగ్రిని స్వాధీనం చేసుకునే అధికారం కమిషన్ కల్పించింది.

● విశాఖపట్నం

# భలే రికార్డు

## పెందుర్తి ఎమ్మెల్యేలైన తండ్రీ తనయులు

- 1978లో గుడివాడ అప్పన్న, 1989లో గుడివాడ గురునాథరావు విజయం
- 1983లో పెతకంశెట్టి అప్పలనరసింహం, 1996లో గణబాబు గెలుపు
- పెతకంశెట్టి, గణబాబుపై పోటీచేసిన ద్రోణంరాజు సత్యనారాయణ, శ్రీనివాస్ తండ్రీ తనయులే!



గుడివాడ అప్పన్న



గుడివాడ గురునాథరావు

ఉమ్మడి రాష్ట్రంలో రెండో అతిపెద్ద నియోజకవర్గంగా నిలిచిన పెందుర్తి మరో ఘనతను కూడా సాధించింది. ఇక్కడి నుంచి పోటీలో నిలిచిన తండ్రీ తనయులు ఎమ్మెల్యేలుగా ఎన్నికై చరిత్ర పుటల్లో స్థానం సంపాదించుకుంది. ఇలా ఒకసారి కాదు... రెండు సార్లు తండ్రీ కుమారులు పదవులను అలంకరించారు. ఆ వివరాలివి... 1978లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పెందుర్తి నియోజవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన గుడివాడ అప్పన్న సీపీఎం అభ్యర్థి గంగాధరరెడ్డిపై విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత గుడివాడ అప్పన్న కుమారుడు గుడివాడ గురునాథరావు 1989లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీచేసి టీడీపీ అభ్యర్థి పల్లా సింహాచలంపై గెలుపొందారు. ఇలా 1978, 1989లో తండ్రీ కుమారులు ఇద్దరూ ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఘనతను సాధించారు.

అలాగే పెతకంశెట్టి అప్పల నరసింహం, ఆయన కుమారుడు గణబాబు ఇదే నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన పెతకంశెట్టి అప్పలనరసింహం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన ద్రోణంరాజు సత్యనారాయణపై విజయం సాధించి శాసనసభలో అడుగుపెట్టారు. అదేవిధంగా పెతకంశెట్టి కమారుడు పీవీజీఆర్ నాయుడు (గణబాబు) 1996లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగి కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌పై గెలుపొందారు. ఇలా 1983, 96లో తండ్రీ కుమారులు ఎమ్మెల్యేలు అయ్యారు. ఇందులో మరో గమ్మత్తైన విషయం ఏమిటంటే ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తండ్రీ తనయులు పెతకంశెట్టి అప్పలనరసింహం, గణబాబు పోటీచేసిన సందర్భంలో వారి ప్రత్యర్థులు ద్రోణంరాజు సత్యనారాయణ, ద్రోణంరాజు శ్రీనివాస్ కూడా తండ్రీ తనయులే కావడం.



పెతకంశెట్టి అప్పలనరసింహం



పెతకంశెట్టి గణబాబు

### అక్కడ తండ్రులు... ఇక్కడ కుమారులు

ఇక ఈ సార్వత్రిక ఎన్నికల్లో మరో విశేషం చోటుచేసుకుంది. పెందుర్తిలో పరస్పరం పోటీ పడిన వారి కుమారులు ప్రస్తుతం గాజువాకలో ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గం నుంచి వైసీపీ, టీడీపీ అభ్యర్థులుగా తలపడుతున్న గుడివాడ అమర్‌నాథ్, పల్లా శ్రీనివాసరావు తండ్రులు గతంలో పెందుర్తి నియోజవర్గం నుంచి పోటీచేశారు. ఇప్పటి గాజువాక అప్పట్లో పెందుర్తి పరిధిలో ఉండేది. ఈక్రమంలో 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెందుర్తి నుంచి గుడివాడ గురునాథరావు, పల్లా సింహాచలం పోటీ చేశారు. గుడివాడ విజయం సాధించారు. యాదృచ్ఛికంగా ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్ గురునాథరావు కుమారుడు. ఇక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం. ఇలా గతంలో పెందుర్తిలో తలపడిన తండ్రుల స్థానంలో వారి తనయులే గాజువాక నుంచి పోటీ పడుతుండడం ప్రత్యేకత సంతరించుకుంది.

● పెందుర్తి

## మీకు తెలుసా!

### వీవీపీఏటీ (వీవీప్యాట్) అంటే ...




ఎన్నికల సంస్కరణల్లో భాగంగా భారత ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన పరికరాలలో వీవీపీఏటీ (వీవీప్యాట్) ఒకటి. దీనిని ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్ అంటారు. ఇది ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌కు అనుసంధానమయ్యే పేపర్ రికార్డు. ప్రింటర్ పోర్ట్ ద్వారా ఈవీఎంతో కనెక్ట్ చేస్తారు. ఓటు రికార్డింగ్‌ను ధ్రువీకరించడానికి పేపర్ స్లిప్‌లో ఓటు డేటా, కౌంటర్లను రికార్డు చేస్తుంది. ఎన్నికల్లో మోసాలు, రిగ్గింగ్‌ను తొలగించడంలో సహాయపడుతుందని ఈసీ ప్రకటించింది.

### డిపాజిట్ కోల్పోవడం అంటే..

ఎన్నికల సమయంలో కొంతమంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారని వింటుంటాం. అంటే.. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థికి పోలై, చెల్లిన ఓట్లలో 1/6వ వంతు రావాల్సి ఉంటుంది. లేదంటే పోటీ చేసేందుకు చెల్లించిన డిపాజిట్ సొమ్మును కోల్పోయినట్టు.

# ఉద్యోగాలు కావాలంటే కూటమి రావాలి

- అరకు పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత
- చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో ర్యాలీలు, సభలు




చింతపల్లి సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గీత... కొయ్యూరు బహిరంగ సభకు హాజరైన గిరిజనులు

**చింతపల్లి/కొయ్యూరు, ఏప్రిల్ 29:** ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావాలంటే కూటమి అధికారంలో రావాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత అన్నారు. చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో సోమవారం పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి, టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించారు. అనంతరం కొత్తపల్లి గీత మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడడం జరిగిందన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ ప్రాధేయపడితే ఓట్లు వేసి గెలిపించి కష్టాలను కొనితెచ్చుకున్నామన్నారు. గిరిజన ఎంపీ, ఎమ్మెల్యేలు ఏనాడూ ఆదివాసీల సమస్యలపై ముఖ్యమంత్రితో గాని, అసెంబ్లీ, పార్లమెంట్‌లోగాని మాట్లాడిందిలేదన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఆదివాసీలకు కలిగిన మేలు ఏమీ లేదన్నారు. గిరిజనులు మరో అవకాశం జగన్‌రెడ్డికి అప్పగిస్తే షెడ్యూల్ ప్రాంతాల సంపదను కార్పొరేటు సంస్థలకు ధారాదత్తం చేస్తాడన్నారు. రాష్ట్రంలో రావణాసుర పాలన సాగుతున్నదన్నారు. వైసీపీకి ఓటు వేస్తే మనకు మనమే ఫ్యాన్‌కు ఉరి వేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన 38 ప్రజా సంక్షేమ పథకాలు రద్దు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు పేరుతో రూ.12 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రతీ తల మీద అప్పు రుద్దిన ఘనుడన్నారు. విద్యుత్తు, ఆర్టీసీ చార్జీల మోతతో సామాన్యుడి నడ్డివిరిచారన్నారు. మద్యపాన నిషేధం చేస్తానని బీరాలు పలికి మద్యం అమ్మకాలపై మరో 20 సంవత్సరాలకు అప్పు చేసి మహిళలను మోసగించారని, ప్రజల మాన, ప్రాణాలను తాకట్టు పెట్టే జగన్మోహనరెడ్డిని తరిమి కొట్టాలని గీత పిలుపునిచ్చారు. అరకు ఎంపీగా తనను గెలిపిస్తే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు తీసుకొస్తానన్నారు. పాడేరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా గిడ్డి ఈశ్వరి సైకిల్ గుర్తుపై, తనను కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు.

**జీవో-3 పునరుద్ధరణ చంద్రబాబుతోనే సాధ్యం: గిడ్డి ఈశ్వరి**

జీవో నంబరు-3 తీసుకొచ్చింది చంద్రబాబు.. మళ్లీ పునరుద్ధరణ కూడా చంద్రబాబుతోనే సాధ్యం అని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం జీవో నంబరు-3ని రద్దు చేస్తే పునరుద్ధరించేందుకు వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, కనీసం రివ్యూ పిటిషన్ కూడా దాఖలు చేయలేదని చెప్పారు. ఈ జీవో లేకపోవడంతో ఆదివాసీలకు ఉద్యోగాలు రావడంలేదన్నారు. గిరిజనులు వ్యతిరేకిస్తున్న యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టు ఆగాలంటే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు నిర్మాణాలకు వైసీపీ ప్రభుత్వం సిద్ధపడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుంటే ప్రాజెక్టు వల్ల ముంపునకు గురయ్యే గ్రామాలు, వ్యవసాయ భూములు, పక్కా గృహాలను కాపాడుకుంటామన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికి వెళ్లి వైసీపీ అరాచకపాలనపై ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. అలాగే సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాలను వివరించాలని సూచించారు. గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపాలంటే అందరూ ఎంపీ గీతను కమలం గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కూడా కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో నియంతృత్వ పాలనకు చరమ గీతం పాడి, కబ్జాకోరు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కొయ్యూరు టీడీపీ కార్యదర్శి తోట దొరబాబు ఆధ్వర్యంలో గిడ్డి ఈశ్వరి సమక్షంలో చీడిపాలెం మాజీ సర్పంచ్ లోతా జోగిరాజుతో పాటు పలువురు వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ గిడ్డి ఈశ్వరి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకులు ఎంవీవీ ప్రసాద్, బొర్ర నాగరాజు, విజయరాణి, చల్లంగి జ్ఞానేశ్వరి, రాజమండ్రి నారాయణరావు, చల్లంగి లక్ష్మణరావు, మండల నాయకులు కిల్లో పూర్ణచంద్రరావు, ముక్కలి రమేశ్, రీమల ఆనందరావు, సత్యనారాయణ, గంటా నళిని, శ్రీరామూర్తి, కాఫీ బోర్డు సభ్యుడు ప్రభాకరరావు పాల్గొన్నారు.



కొయ్యూరు: బహిరంగ సభలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి, పక్కన కొత్తపల్లి గీత



రాళ్లగెడ్డవీధిలో రంధ్రం పడిన విద్యుత్ స్తంభం

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

**బిక్కుబిక్కుమంటున్న రాళ్లగెడ్డవీధి జనం**

**అధికారులకు విషయం తెలిసినా పట్టని వైనం**

**జి.మాడుగుల, ఏప్రిల్ 29:** మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ కేంద్రంలోని రాళ్లగెడ్డ వీధిలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభానికి రంధ్రం ఏర్పడడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి దాపురించింది. దీంతో స్తంభం పరిసరాల్లోని ఇళ్లల్లో నివాసం ఉంటున్న వారంతా భయాందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. స్తంభం తుప్పు పట్టి కన్నం ఏర్పడిందన్న విషయాన్ని సంబంధిత సిబ్బందికి పలుమార్లు తెలిపినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో అధికారులు స్పందించి రంధ్రం పడిన స్తంభం మార్చాలని వారు కోరుతున్నారు.

## శిథిలావస్థలో బస్‌షెల్టర్

**డుంబ్రిగుడ, ఏప్రిల్ 29:** మండలంలోని సాగర పంచాయతీ కిల్లోగుడ జంక్షన్‌లో బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరింది. సాగర, సొవ్వా పంచాయతీల పరిధిలోని గిరిజనులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. వీరితో పాటు అలాగే ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల గిరిజనులకు ఈ షెల్టర్ నీడగా నిలిచేది. బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ బస్‌షెల్టర్‌ను మరమ్మతు చేసి వినియోగంలో తీసుకురావాలని వారు కోరుతున్నారు.

## ఎన్నికల బరిలో నిలిచేది వీరే!

... 5వ పేజీ తరువాయి

కేవీ రమేశ్‌నాయుడు టీడీపీ అధిష్ఠానం నచ్చజెప్పడంతో తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు.

**అరకులోయ అసెంబ్లీ స్థానానికి 17 మంది..**

అరకులోయ అసెంబ్లీ స్థానానికి 22 మంది నామినేషన్లు ఆమోదం పొందగా, ఐదుగురు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 17 మంది పోటీలో నిలిచారు. స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేసిన మర్రి ఉషారాణి, తాగుల రామదాసు, నారాజీ గోవిందరావు, నోగిలి చంద్రకళ, సమర్థి గులాబి నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పాంగి రాజారావు(బీజేపీ), రేగం మత్స్యలింగం(వైసీపీ), శెట్టి గంగాధరస్వామి(కాంగ్రెస్), లకే రాజారావు(బీఎస్పీ), కిల్లో అనిల్‌కుమార్(లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), చుంచు రాజుబాబు(గొండ్వాన దండకారణ్య పార్టీ), బురిడి ఉపేంద్ర(జై భారత్ జాతీయ పార్టీ) (భారత్ ఆదివాసీ పార్టీ) పుచ్చపుండి రామకృష్ణ, స్వతంత్ర అభ్యర్థులు సివేరి అబ్రహం, చెండా ఏలియా, కమ్మిడి నిర్మల, గెమ్మిలి కృష్ణారావు, నారాజీ మధుబాబు, మొస్యా సుజాత, సమర్థి రఘునాథ్, వంతల రామన్న, సమర్థి భవానీలు పోటీలో ఉంటారని సమాచారం.

**రెండు నియోజకవర్గాల్లోనూ అసెంబ్లీకి రెండేసి ఈవీఎంలే..**

ఒక స్థానంలో 16 మంది అభ్యర్థులు బరిలో ఉంటే రెండేసి ఈవీఎంలు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఏజెన్సీలో పాడేరు అసెంబ్లీ నియోజవర్గం పరిధిలో 16 మంది, అరకులోయ అసెంబ్లీ పరిధిలో 17 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీంతో రెండు అసెంబ్లీ స్థానాల పరిధిలోనూ ప్రతి బూత్‌లో ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం రెండేసి చొప్పున ఈవీఎంలు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి. ఎంపీ అభ్యర్థుల ఈవీఎంతో కలిపితే ప్రతి పోలింగ్ కేంద్రంలో మొత్తం మూడు ఈవీఎంలు ఏర్పాటు చేయకతప్పదు.

# ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులే కీలకం

**అరకులోయ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అభిషేక్**



సమావేశంలో మాట్లాడుతున్న అరకు ఆర్వో వి.అభిషేక్... హాజరైన వివిధ శాఖల అధికారులు

**పాడేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ స్పష్టం చేశారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం సెక్టార్ అధికారులతో నిర్వహించిన శిక్షణ, సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఈవీఎంల నిర్వహణపై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు పనిచేయకపోయినా, ఇబ్బందులు ఏర్పడినా సెక్టార్ అధికారులకు ఫోన్‌కాల్ ద్వారా సిబ్బంది సమాచారం అందిస్తారన్నారు. అందుకు అనుగుణంగా తక్షణమే స్పందించి ఈవీఎంలను మార్చడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పోలింగ్ శాతాన్ని సైతం ఎప్పటికప్పుడు సేకరించి ఆర్వోకు తెలపాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ నిర్వహించాలన్నారు. ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా సెక్టార్ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, రిటర్నింగ్ అధికారికి సహాయకులైన తహసీల్దార్లు రవికుమార్, రాజారామ్మోహన్‌రావు, నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

# సీహెచ్‌సీలో రోగులకు అందని భోజనం

- రెండు రోజులుగా గర్భిణులు, బాలింతలు అగచాట్లు
- బయట ఆహారం కొనుక్కుని తెచ్చుకుంటున్న వైనం



సీహెచ్‌సీలో ఉంటూ వైద్య సేవలు పొందుతున్న రోగులు

**ముంచంగిపుట్టు, ఏప్రిల్ 29:** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో రోగులకు ఉచిత భోజనం సక్రమంగా అందడం లేదు. దీంతో సీహెచ్‌సీలో ఉంటూ వైద్య సేవలు పొందుతున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా గర్భిణీలు, బాలింతలు, జ్వర బాధితులు ఆహారం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గత్యంతరం లేకపోవడంతో బయట నుంచి అల్పాహారం, భోజనాలు తీసుకొని వచ్చి తినాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టాల్సి ఉంది. ప్రస్తుతం సీహెచ్‌సీలో ఉంటూ 24 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. వారికి ఆదివారం మధ్యాహ్నం అందించాల్సిన భోజనం సాయంత్రం 4 గంటలకు పెట్టారని తెలిపారు. అలాగే సోమవారం అల్పాహారం పెట్టలేదు. మధ్యాహ్నం భోజనం సైతం ఆలస్యంగా అందించారు. దీంతో కొంత మంది రోగులు తమ సొంత డబ్బులు వెచ్చించి భోజనాలను బయట నుంచి తీసుకువచ్చి తింటున్నారు. అల్పాహారం, భోజనం సక్రమంగా అందడం లేదని, అలాగే అవి అందించినా సకాలంలో అందించడం లేదని రోగులు స్థానిక వైద్యాధికారి గీతాంజలి దృష్టికి తీసుకువెళ్లారు. నిర్వాహకులకు సక్రమంగా బిల్లులు అందకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని తెలిసింది. అధికారులు స్పందించి సీహెచ్‌సీలో వైద్య సేవలు పొందున్న రోగులకు సకాలంలో ఆహారం అందేలా చూడాలని కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో మారెమ్మ చల్లనీటి ఉత్సవం



గ్రామ పొలిమేరల్లో పసుపు నీటితో చల్లదనం చేస్తున్న భక్తులు

**సీలేరు, ఏప్రిల్ 29:** సీలేరు మారెమ్మ అమ్మవారి 52వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా సోమవారం చల్లనీటి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మాలధారణ భక్తులు భజనలు చేస్తూ గ్రామ పొలిమేరలను పసుపు నీరు చల్లుతూ శుద్ధి చేశారు. గ్రామంలో అమ్మవారు సంచరిస్తూ ఉంటారని, ప్రధాన పండుగ తరువాత పసుపు నీటితో చల్లదనం చేస్తే గ్రామానికి మంచి జరుగుతుందని పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం. చల్లనీటి ఉత్సవంలో చల్లే పసుపు నీటిని గ్రామంలో ప్రజలు కూడా తమ ఇంటికి తీసుకువెళ్లి చల్లితే, వారికి కూడా మంచి జరుగుతుందని స్థానికుల నమ్మకం.

## 245 మద్యం సీసాలు పట్టివేత

**ఒకరి అరెస్టు.. మరొకరు పరారీ**



పట్టుబడిన మద్యం సీసాలతో సీఐ వెంకటరమణ, ఎస్‌ఐలు

**కొయ్యూరు, ఏప్రిల్ 29:** మండలంలోని డౌనూరు వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 245 మద్యం సీసాలను పట్టుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు కొయ్యూరు సీఐ వెంకటరమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు డౌనూరు చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి తనతో పాటు కొయ్యూరు, మంప ఎస్‌ఐలు రామకృష్ణ, లోకేష్‌కుమార్, పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా నిఘా పెట్టామన్నారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు చేస్తుండగా మద్యం పట్టుబడిందన్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు గోనె సంచుల్లో మద్యం సీసాలను మూటలుగా కట్టి తీసుకు వస్తూ పట్టుబడ్డారన్నారు. గొలుగొండ మండలం విప్పలపాలెం గ్రామానికి చెందిన లగుడు శ్రీను పట్టుబడగా, మరో వ్యక్తి ద్విచక్ర వాహనంతో పరారీ అయ్యారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టుగా ఆయన తెలిపారు.

## నైపుణ్యాలను మెరుగుపర్చుకోండి

- విద్యా శాఖ ఆర్‌జేడీ శోభరాణి

**చింతపల్లి, ఏప్రిల్ 29:** విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) శోభ రాణి సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 16వ వార్షికోత్సవం, క్రీడా దినోత్సవం వేడుకకు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆర్‌జేడీ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతీ విద్యార్థి ఉద్యోగాలకు అర్హులన్నారు. సివిల్స్, గ్రూప్స్, బ్యాకింగ్, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాల్లో రాణించాలన్నారు. ఉన్నత ఉద్యోగాలు సాధించాలంటే విద్యార్థికి వ్యక్తిగత క్రమశిక్షణ, ప్రణాళిక, కృషి, పట్టుదల ఉండాలన్నారు. ఈ లక్షణాలు కలిగిన విద్యార్థులు సాధించలేనిదంటూ ఏమీ లేదన్నారు. డిగ్రీతో విద్యకు దూరం కాకుండా ఉన్నత విద్యనభ్యసించాలన్నారు. ఉద్యోగాలతో పాటు విద్యార్థులు స్వయం ఉపాధి అవకాశాలను సైతం అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ వి.రమణ, లీలాపావని, నవ ప్రమీళ, ఈశ్వరరావు, గ్రంథాలయం అధికారి జగత్‌రాయ్ పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ శోభరాణి

## ఎన్నికల విధులపైనా ఇంత నిర్లక్ష్యం?

... 5వ పేజీ తరువాయి

ఏదో పని చేశాంలే అన్నట్టుగా రిటర్నింగ్ అధికారులు వ్యవహరిస్తుండడంతో ఫారం-7ను పక్కాగా రూపొందించలేకపోయారని తెలిసింది. అలాగే ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని సైతం సకాలంలో, సక్రమంగా అందించాలనే ఆలోచన చేయకపోవడంతో జిల్లా కేంద్రంలోని మీడియా ప్రతినిధులు సైతం నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ ఈ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**సంక్షిప్తంగా..**

## నిరాడంబరంగా ముత్యాలమ్మ అమ్మవారి సంబరం

**చింతపల్లి, ఏప్రిల్ 29:** మన్యం ప్రజల ఆరాధ్యదైవమైన ముత్యాలమ్మ అమ్మవారి సంబరం నిరాడంబరంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పసుపులేటి వినాయకరావు, ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు తెలిపారు. అమ్మవారి ఆలయంలో సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా అధికారుల నుంచి అనుమతులు రాలేదన్నారు. సోమవారం అమ్మవారి గరగలు (పాదాలు) సుర్లవారి వంశీయుల స్థావరాల నుంచి గిరిజన సంప్రదాయ నృత్యవాయిద్యాలతో ఊరేగింపు నడుమ శతకంపట్టుకు తీసుకొస్తామన్నారు. మంగళవారం చింతపల్లి పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. బుధవారం ఊరేగింపు నడుమ అనుపోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. అలాగే మే ఒకటిన అమ్మవారి ఆలయం వార్షికోత్సవం నిర్వహిస్తామన్నారు. సంబరానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కోశాధికారి గసాడి పద్మనాభం, ఉత్సవ కమిటీ సభ్యులు కె.వెంకటరమణ, సుర్ల వీరేంద్ర, యూవీగిరి, టి.నాగేశ్వరరావు, రమేశ్, తాడి రమణ, జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## లిక్విడ్ గంజాయితో ఒకరి అరెస్టు

**చింతపల్లి, ఏప్రిల్ 29:** ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశామని అన్నవరం ఎస్‌ఐ రాజారావు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొత్తూరు బయలు జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా గొప్పుగుడిసెలు గ్రామానికి చెందిన పాంగి శివాజీ లిక్విడ్ గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడని చెప్పారు. పట్టుబడిన లిక్విడ్ గంజాయి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

## యువత చదువుపై దృష్టిసారించాలి

**సీలేరు, ఏప్రిల్ 29:** గిరిజన యువత చదువుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ సూచించారు. గూడెంకొత్తవీధి మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గాలికొండ పంచాయతీలోని పలు గ్రామాలను సోమవారం సందర్శించారు. కొండజర్త, మైనకోట, కొండజర్త, పెద్దలంక, పాత్రునిగుంట గ్రామాల్లో గిరిజనులతో సమావేశమై మావోయిస్టుల వల్ల గ్రామాలు అభివృద్ధి చెందడం లేదని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి పోలీసు శాఖ సిద్ధంగా ఉందని, ఇందుకోసం ప్రజల మద్దతు అవసరమని చెప్పారు. యువత చదువులపై దృష్టినిసారించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తేనే గ్రామాలు అభివృద్ధి దిశగా వెళతాయన్నారు. ఓటు హక్కును వినియోగించుకొను ప్రజాస్వామ్యానికి మద్దతు పలకాలని ఎస్‌ఐ సూచించారు. అనంతరం గిరిజనులకు వాలీబాల్ కిట్లు, మందులను పంపిణీ చేశారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించాలి

**టీడీపీ డివిజన్ నాయకుడు పాండురంగస్వామి**



సూపర్-6 కరపత్రాలు పంచుతున్న టీడీపీ నేతలు

**ముంచంగిపుట్టు, ఏప్రిల్ 29:** టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటును వేసి గెలిపించాలని టీడీపీ డివిజన్ ఆయకుడు పి.పాండురంగ స్వామి కోరారు. సోమవారం దారెల పంచాయతీ పరిధిలోని మాలిపుట్టులో విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, బీజేపీ జనసేన ఉమ్మడి అభ్యర్థులు అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావులను గెలిపించాలన్నారు. కూటమి గెలుపుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. అలాగే చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రతీ ఒక్కరూ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బాబు వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మండి కిశోర్‌కుమార్, కిల్లో లైకోన్, మధు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరములో తాగునీటి సౌకర్యం

**ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన**



ఉరము గ్రామంలో బోరు పనులు ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది

**జి.మాడుగుల, ఏప్రిల్ 29:** మండల కేంద్రంలోని ఉరము గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామంలో తాగునీటి కష్టాలపై 'ఉరములో తాగునీటికి కటకట' అనే శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన అధికారులు ఆదివారం ఉదయం ఉరము గ్రామం సందర్శించిన తాగునీటి పథకాలపై ఆరా తీశారు. ఆరు నెలల ముందు ఎంపీ నిధులతో మంజూరైన తాగునీటి బోరు పనులను పునఃప్రారంభించారు. అదే రోజు సాయంత్రానికి తాగునీరు సౌకర్యం కల్పించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## కూటమి నేతల ఇంటింట ప్రచారం



లోచలిలో ఇంటింట ప్రచారం చేస్తున్న నాయకులు

**జి.మాడుగుల, ఏప్రిల్ 29:** మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసి సోమవారం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లోచలి, వంతల పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి సూపర్-6 పథకాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు ఎస్.నాగబ్బాయి, కె.భీంబాబు, భీమన్న, నూకరాజు పాల్గొన్నారు.